క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మహాలక్ష్మి జయంతి

కర్నూలు కల్చరల్: ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో మహాలక్ష్మి జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

కర్నూలు సిటీ/హాస్పిటల్: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న నిర్వహించిన చిత్ర లేఖన, వక్తృత్వ పోటీలలో గెలుపొందిన విజేతలకు మంగళవారం రెడ్‌క్రాస్ ప్రాంగణంలో డీఈఓ డాక్టర్ వి రంగారెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. చిత్ర లేఖనంలో ఎస్.ఆఫ్రీన్ మొదటి, ఇంద్రజిత్(మాంటి హైస్కూల్, కర్నూలు) రెండవ స్థానం, వక్తృత్వ పోటీల్లో ఎస్.ఆఫ్రీన్(కల్లూరు మండలం, పర్ల జెడ్పీ హైస్కూల్), సోహని(శ్రీ చైతన్య స్కూల్, కర్నూలు) రెండవ స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, జిల్లా సైన్స్ కో–ఆర్డినేటర్ రంగమ్మ పాల్గొన్నారు.

రవీంద్రారెడ్డిని గెలిపించండి

కర్నూలు(రాజ్‌విహార్): శాసనమండలి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన 3వ వార్డు చిన్న అమ్మవారి శాల ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

● కర్నూలు(అర్బన్): పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించుకుందామని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి కోరారు. మంగళవారం ఆయన నగరంలోని 19వ వార్డులో ప్రచారం నిర్వహించారు.

ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలి

కర్నూలు(సెంట్రల్): పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, అనంతపురం కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. మంగళవారం ఆమె అనంతపురం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. కార్యక్రమంలో జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఓటు వేసే విధానంపై అవగాహన

కర్నూలు (టౌన్): శాసన మండలి ఎన్నికల్లో ఓటు వేసే విధానంపై స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో నగరపాలక అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ అవగాహన కల్పించారు. నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, డిప్యూటీ మేయర్లు సిద్దారెడ్డి రేణుకా, నాయకంటి అరుణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నమూనా బ్యాలెట్ పత్రంతో ఓటు ఎలా వేయాలో తెలియజేశారు.

సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

కర్నూలు(సెంట్రల్): శాసనమండలి పోలింగ్ నియమావళి అమలులో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకమని మైక్రో అబ్జర్వర్ నోడల్ అధికారి, సీపీఓ అప్పలకొండ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మైక్రో అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ రోజున కేంద్రంలో జరిగే ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఎవరైనా విధులను అతిక్రమించి ప్రవర్తిస్తే పీఓల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఎన్నికల ప్రవర్తన నియమావళిపై మాస్టర్ ట్రైనర్ సలీంబాషా, సిద్ధలింగమూర్తి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఎల్‌డీఎం వెంకటనారాయణ పాల్గొన్నారు.

కష్టమర్ల అభిమానాన్ని చూరగొనాలి



అంజాద్‌బాషాను సన్మానిస్తున్న సంస్థ సభ్యులు

కర్నూలు (టౌన్): అందరికి అందుబాటులో నాణ్యమైన గృహాలు నిర్మించి కష్టమర్ల అభిమానాన్ని చూరగొనాలని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా సూచించారు. మంగళవారం స్థానిక బళ్లారి చౌరస్తా సమీపంలోని స్కందాన్షి షాపింగ్ మాల్‌లో ఏర్పాటు చేసిన ఎస్ఎస్ ఇన్ఫ్రా బిల్డర్స్, డెవలపర్స్ నూతన కార్యాలయాన్ని సందర్శించారు. ఎస్ఎస్ బిల్డర్స్ దినదినాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ ఇన్ఫ్రా బిల్డర్స్ డెవలపర్స్ సంస్థ అధినేత ఇలియాజ్ అహమ్మద్ పాల్గొన్నారు.





కేవీఆర్ కళాశాలలో మహిళా దినోత్సవ సంబరం



వ్యవసాయ శాఖలో..



కేక్ కట్ చేస్తున్న మహిళా వైద్యులు



మాట్లాడుతున్న నాలుగో అదనపు జిల్లా జడ్జి ప్రతిభాదేవి

అగ్రపథాన 'ఆమె'

అన్ని రంగాల్లో 'ఆమె' అగ్రపథాన దూసుకుపోతోంది. వ్యవసాయ క్షేత్రం నుంచి అంతరిక్షం వరకు తనకు తానే సాటిగా పురుషులకు ధీటుగా ఎదుగుతోంది. అసమానతలు, అణచివేతలు, అవమానాలనే తన ఉన్నతికి సోపానాలుగా మలుచుకొని ఉన్నత శిఖరాలను చేరుకుని ఖ్యాతిని చాటుతోంది. కుటుంబంతో పాటు, తాను ఎంచుకున్న రంగంలో దేదీప్య మానంగా వెలుగొందుతోంది. బుధవారం 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్న కొందరి మహిళలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.. – కర్నూలు కల్చరల్/హాస్పిటల్

● అతివలు అనితర సాధ్యులు
● విభిన్న రంగాల్లో రాణిస్తున్న మహిళలు
● నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



30 మందికి ఉపాధి..



కుట్టు మిషన్‌లో మెలకువలు చెబుతున్న బైరెడ్డి రామతులశమ్మది పుసులూరు గ్రామం. పదోతరగతి వరకు చదువుకుని టైలరింగ్ నేర్చుకున్నారు. ఈమెకు బండి ఆత్మకూరుకు చెందిన వెంకటనారాయణరెడ్డితో 2000లో వివాహమైంది. వారు జీవనోపాధి నిమిత్తం కర్నూలుకు వచ్చి స్థిరపడ్డారు. టైలరింగ్‌లో మరింత మెలకువలు తెలుసుకున్న రామతులశమ్మ 2008లో ఏక్యాంప్‌లో తులసి బోటిక్ పేరుతో టైలరింగ్ సెంటర్ ప్రారంభించారు. కస్టమర్ల అభిరుచికి తగ్గట్లు మెటీరియల్ డిజైన్స్ ఇస్తుండటంతో ఏ కొత్త డిజైన్ వచ్చినా ఇక్కడ తయారు చేస్తారనే పేరు వచ్చింది. ముంబయి, ఉత్తరప్రదేశ్, బిహార్‌లకు చెందిన 20 మంది పురుషులకు, కర్నూలు నగరానికి చెందిన 10 మంది మహిళలకు బోటిక్‌లో ఉపాధి కల్పిస్తోంది. మెటీరియల్ డిజైన్, డ్రస్‌ను బట్టి వర్కర్స్‌కు కుట్టుకూలీ కమీషన్‌ను వారానికి సుమారు రూ.60 వేల వరకు చెల్లిస్తున్నారు. భర్త కూడా ప్రైవేట్ ఉద్యోగం మానేసి భార్యకు తోడుగా బోటిక్ నిర్వహణలో పాలు పంచుకుంటున్నాడు. 'ఎప్పటికప్పుడు వస్తున్న డిజైన్లు ఆకళింపు చేసుకుంటూ జాకెట్లు, లెహంగాలు, లాంగ్ ఫ్రాక్స్ తదితర అన్ని డ్రెస్ మెటీరియల్స్ తయారు చేస్తున్నాం. రకరకాల పూసలతో తయారుచేసే జాకెట్లకు ఆదరణ బాగా ఉంది. పూసలతో తయారు చేసే జాకెట్లు, లెహంగాలు, డ్రస్ మెటీరియల్‌కు డిమాండ్ ఉండడంతో నైపుణ్యం కలిగిన బిహార్, యూపీ, బాంబే కార్మికులను పిలిపించి తయారు చేయిస్తున్నాం. బోటిక్ నిర్వహిస్తూ కుటుంబం జీవనం సాగిస్తుండటంతో పాటు మరికొంత మందికి ఉపాధి కల్పిస్తున్నా' అంటున్నారు రామతులశమ్మ.

ఆత్మసంతృప్తి



అత్యవసర రోగికి వైద్యం చేస్తున్న ఈ యువతి పేరు డాక్టర్ దూదేకుల రేష్మ. కర్నూలు మెడికల్ కాలేజీలోనే ఎంబీబీఎస్ చదివి 2017లో అనెస్తీషియాలో పీజీ పూర్తి చేశారు. అనంతరం మెడికవర్ హాస్పిటల్‌లోని ఐసీయూలో క్రిటికల్ కేర్ విభాగంలో ఇంటెన్సివిస్ట్‌గా పనిచేస్తున్నారు. 'నాకు మొదటి నుంచి ఛాలెంజింగ్‌గా పనిచేయడం అంటేనే ఇష్టం. ఆపరేషన్ థియేటర్‌తో పాటు ఐసీయూలోనూ రోగులకు ఒకేసారి సేవ చేయాలని నిర్ణయించుకున్నాను. అందుకే అనెస్తీషియా, క్రిటికల్ కేర్‌లో ఇంటెన్సివిస్ట్‌గా పనిచేస్తున్నా. ఇక్కడ నిత్యం రోగులు క్రిటికల్ కండిషన్‌లో ఉంటారు. వారికి ఎప్పుడు అత్యవసర పరిస్థితి వస్తుందో చెప్పలేం. కంటికి రెప్పలా కాచుకుని ఉండాలి. క్షణాల్లో నిర్ణయం తీసుకుని చికిత్స చేస్తూ ఉండాలి. ఆ నిర్ణయం ఒక ప్రాణం నిలబెడితే అంతకేంటే ఆత్మసంతృప్తి మరొకటి ఉండదు' అంటోంది డాక్టర్ రేష్మ.

ఘనంగా మహిళ దినోత్సవం

కర్నూలు సిటీ: అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని పలు విద్యా సంస్థల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళ ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి ప్రోత్సాహ బహుమతులు అందించి అభినందించారు.

● బి.క్యాంపులోని ప్రభుత్వ ఒకేషనల్ కాలేజీలో నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్ పాల్గొని ప్రసంగించారు. వేడుకల్లో అధ్యాపకులు జి.ప్రసన్నకుమార్, ఎ.వాణి ప్రసన్న, వై.వి రామకృష్ణ, జబీన్ అక్తర్, గిరిజారాణి, అరుణకుమారి, లావణ్య పాల్గొన్నారు.

● కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాతృమూర్తి మునువర్ సుల్తానా, ఐద్వా అధ్యక్షురాలు పి.నిర్మల ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. అనంతరం కాలేజీ ప్రిన్సిపాల్ డా.ఇందిరాశాంతి, అధ్యాపకులు డాక్టర్ బాశెట్టి లత, డాక్టర్ పార్వతి పాల్గొన్నారు.

● జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన వేడుకల్లో జేఎన్‌టీయూ ఈసీ మెంబరు డాక్టర్ మమతామోహన్ పాల్గొని ప్రసంగించారు. వేడుకల్లో ప్రముఖ నెఫ్రాలజిస్టు డాక్టర్ ఎస్.శైలజ, హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతి బి.సునీత పాల్గొన్నారు.

● సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో మహిళ సాధికారత విభాగం అధ్యక్షురాలు డాక్టర్ అక్తర్ భాను అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్ పాల్గొని ప్రసంగించారు.

● ఉస్మానియా కాలేజీలో జరిగిన వేడుకల్లో కరస్పాండెంట్ అజ్రా జావేద్ పాల్గొని ప్రసంగించారు.

● కర్నూలు(అర్బన్): స్థానిక కలెక్టరేట్ సమీపంలోని వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయ ప్రాంగణంలో ఏపీ అగ్రికల్చర్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జి పీఎల్ వరలక్ష్మి అధ్యక్షతన మహిళా ఉద్యోగినుల ఆటల పోటీలను నిర్వహించారు.

● కర్నూలు(హాస్పిటల్): మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో మహిళా వైద్యులు సరయు రెడ్డి, సృజన, సింధూర, పార్వతి, శ్రీలత, రేష్మ, వసుంధర, సుష్మ, సంధ్యలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హాస్పిటల్ వైస్ ప్రెసిడెంట్ మహేశ్వర్‌రెడ్డి, సెంటర్ హెడ్ నీలారెడ్డి పాల్గొన్నారు.

● కర్నూలు(అర్బన్): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు శ్రీ పతంజలి సాయినాథ్ యోగా ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్షల కిట్లను అందించారు. కార్యక్రమంలో అధ్యక్ష, ఉపాధ్యక్షరాళ్లు పెరుమాళ్ల విశాలాక్షి, మేడ సుచరిత, యోగా గురువు పెరుమాళ్ల దత్తయ్య, వసతి గృహం సంక్షేమాధికారి కె.శిరీష పాల్గొన్నారు.

● కర్నూలు(లీగల్): జిల్లా న్యాయ సేవా సదన్‌లో మహిళా న్యాయవాదుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నాలుగో అదనపు జిల్లా జడ్జి ప్రతిభాదేవి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు తీసిపోని విధంగా రాణించాలన్నారు. కార్యక్రమంలో ఆరవ అదనపు జిల్లా జడ్జి పి.పాండురంగారెడ్డి, ఏడో అదనపు జిల్లా జడ్జి జి.భూపాల్‌రెడ్డి, సీబీఐ జడ్జి ఎం.వెంకటరమణ, మెజిస్ట్రేట్లు జ్యోత్స్నదేవి, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపును ఆపలేరు



మాట్లాడుతున్న బీవై రామయ్య. చిత్రంలో ఎంపీ సంజీవ్‌కుమార్, అభ్యర్థి మధుసూదన్

కర్నూలు (న్యూటౌన్): ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపును ఆపలేరని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు బీవై రామయ్య, ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్టాంటన్‌పురంలోని పార్టీ కార్యాలయంలో కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్లంపూర్ డాక్టర్ మధుసూదన్ పరిచయ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ నెల 13న జరగబోయే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అల్లంపూర్ డాక్టర్ మధుసూదన్‌ను గెలిపించాలని కోరారు.

ఒక్క ఓటు కూడా పక్కకు పోరాదు



కార్పొరేటర్లతో సమావేశమైన ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, స్థానిక సంస్థల అభ్యర్థి డాక్టర్ మధుసూదన్

కర్నూలు(రాజ్‌విహార్): శాసనమండలి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ తమ హక్కును వినియోగించుకోవాలని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ సూచించారు. మంగళవారం రాత్రి ఆయన మండలి అభ్యర్థి డాక్టర్ మధుసూదన్‌తో కలసి తన కార్యాలయంలో కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఒక్క ఓటు కూడా పక్కకు పోవడానికి వీలు లేదని, పార్టీ ఆదేశాలకు లోబడి వైఎస్సార్‌సీపీ బలపరచిన మధుసూదన్‌కే వేయాలన్నారు.

● పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ పట్టభద్రులను కోరారు. మంగళవారం ఆయన ప్రైవేట్ స్కూళ్లు, ఇళ్లకు వెళ్లి మొదటి ప్రాధాన్యత ఓటును రవీంద్రారెడ్డికి వేయాలని అభ్యర్థించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

కర్నూలు: స్థానిక పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజ్‌లో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమయ్యే విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగం రాదన్నారు. స్నేక్ డ్రైవింగ్, రాంగ్ రూట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్, అతివేగంతో జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలతో వచ్చే విద్యార్థులను కళాశాలలోకి అనుమతించొద్దని యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు.

డాక్టర్ ముంతాజ్ బేగంకు యోగాచార్య అవార్డు



డాక్టర్ ముంతాజ్ బేగం

కర్నూలు (టౌన్): నగరానికి చెందిన యోగ శిక్షకురాలు డాక్టర్ ముంతాజ్ బేగంకు కర్ణాటక రాష్ట్ర యోగాసన అసోసియేషన్.. యోగాచార్య అవార్డు ప్రకటించింది. 2019లో న్యూఢిల్లీలో హెచ్‌బీయూ యూనివర్సిటీ నుంచి యోగ, మెడిటేషన్‌లో డాక్టరేట్ అందుకున్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన జాతీయ న్యాయ నిర్ణేతల పరీక్షల్లో 85 మార్కులు సాధించి దేశంలో మొదటి ర్యాంకు సాధించింది. అవార్డు రావడం పట్ల రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ లక్ష్మీకాంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి మంగళవారం హర్షం వ్యక్తం చేశారు.

సురక్షిత ప్రయాణాలే రైల్వే లక్ష్యం

కర్నూలు(రాజ్‌విహార్): ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నదే రైల్వే శాఖ ముఖ్య లక్ష్యమని కర్నూలు సిటీ రైల్వేస్టేషన్ ఆర్‌పీఎఫ్ సీఐ వి.సత్యనారాయణ అన్నారు. మంగళవారం రైల్వేస్టేషన్ ఆవరణంతో పాటు పలు రైళ్లలో తనిఖీలు నిర్వహించారు. భద్రతా కారణాలు, ఇతర సమస్యల గురించి ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు భద్రత పరంగా ఎలాంటి ఇబ్బందులు కలిగినా 139 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఆయన వెంట జీఆర్‌పీ ఎస్ఐ సురేష్ బాబు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కుక్క దాడిలో బాలుడికి గాయాలు



కర్నూలు (టౌన్): స్థానిక గణేష్ నగర్‌లో మంగళవారం ఓ ఇంటి ముందు ఆడుకుంటున్న బాలున్ని కుక్క కరిచింది. భయాందోళనకు గురైన ఆ బాలుడు ఎలాగో తప్పించుకుని ఇంట్లోకి పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నాడు. వెంటనే తల్లిదండ్రులు బాలుడిని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

క్రీడా దుస్తుల పంపిణీ

కర్నూలు (టౌన్): ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహిస్తున్న సీనియర్ ఉమెన్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననున్న జిల్లా క్రీడాకారులకు మంగళవారం స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్‌కోచ్ నటరాజరావు, ఒలింపిక్ సంఘం అడ్వైజర్ పి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం

కర్నూలు కల్చరల్: బుధవారపేటలోని నృసింహ సరస్వతి స్వామి ఆలయం వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. వీరశైవ లింగాయతి ధర్మ సంస్కృతికి పాటు పడిన సంఘం ప్రముఖులను సన్మానించారు. నృసింహ సరస్వతి భక్తి గీతాల పుస్తకావిష్కరణ చేశారు. ఆలయ కమిటీ ధర్మకర్త కోటేశ్వరప్ప అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

12న క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని ఈనెల 12న జిల్లా స్థాయి సీనియర్ బాలుర క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కె. దేవేంద్రగౌడ్ మంగళవారం తెలిపారు.

ఘనంగా హోలీ సంబరాలు



కామదహన హోమంలో పాల్గొన్న భక్తులు



నెహ్రూ నగర్‌లో రంగులు చల్లుకుంటున్న యువకులు



సంబరాల్లో మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు

కర్నూలు కల్చరల్: హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. మంగళవారం నగరంలోని పలు విద్యా సంస్థలతో పాటు పలు ప్రాంతాల్లో ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో హోలీ పౌర్ణమి హోమం, కామదహన దర్శనం కల్పించారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మాంటిస్సోరిలో..

కర్నూలు సిటీ: ఏక్యాంప్‌లోని మాంటిస్సోరీ పాఠశాలలో హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. నర్సరీ విభాగం కో–ఆర్డినేటర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో చిన్నారులు ఒకరికొకరు రంగులు చల్లుకుని ఆనందించారు. చిన్నారులకు దేశ సంస్కృతులు, సంప్రదాయాల గురించి తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు చక్కగా ఉపయోగపడతాయని కోఆర్డినేటర్ రాజేశ్వరి అన్నారు. అనంతరం ఉపాధ్యాయినులు రంగుల ప్రాధాన్యతపై చిన్నారులకు అవగాహన కల్పించారు.

కోల్స్ చర్చిలో ఉచిత వైద్యశిబిరం

కర్నూలు (టౌన్): కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చిలో ప్రతి గురువారం సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కోల్స్ సంఘం స్టాండింగ్ కమిటీ అధ్యక్షుడు ప్రభుదాసు, కార్యదర్శి అనిల్ నాథ్, గ్రేస్ ప్రేయర్ సెల్ సభ్యులు మేరి స్టెఫీ న్ తెలిపారు. మంగళవారం కోల్స్ చర్చి సమావేశ హాలులో వారు విలేకరులతో మాట్లాడారు.











